నాలుగు బస్సులు

కరుణకుమార

కలకత్తా మెయిల్ బయలుదేరే వేళ అయింది. మదరాసు సెంట్రల్ స్టేషన్ ఒకటో నంబరు ప్లాటుఫారం జనంతో కిటకిటలాడుతోంది. మిలిటరీ సోల్జర్లు. ఆంగ్లో ఇండియన్ యువతులు, పిల్లలు, పెద్దలు, మొగ, ఆడా-జనం తోసుకొంటున్నారు. సామానుతో 'లోడు' చేసిన ట్రాలీలు, ప్రయాణీకుల పాదాంగుళుల మీదుగానే బరబరాలాక్కొని చక్కాపోతున్నారు లైసెన్సు కూలీలు. ఆ జనసమ్మర్దంలో ఒక యువకుడు కాళ్ళకు బ్లూకలర్ సాకింగ్సూ, బ్రౌన్ కలర్ షేప్ లెస్ బాటా షూ, సాకింగ్సుమీద గోధుమవన్నె హనావాసూటూ, మెడలో టై వేసుకొని, కళ్ళకి అద్దాలు తగిలించుకొని, కుడిచేత్తో లెదర్ సూటుకేసు పట్టుకొని, ముందుచూపే గాని వెనక చూపు లేకుండా విసవిస నడచిపోతున్నాడు. అతడే స్టేషన్ కి వెడుతున్నాడో తెలియదు. అతని ముఖంలోకి తేరిపార చూస్తే తొందరగా రైలులో పడాలనో లేక మరెందుకో—ఒకవిధమైన ఆందోళన అతని హృదయాన్ని కళవళపెడుతున్నట్టు, సూచనలు గోచరిస్తున్నవి. అతని నడక వేగంలో చెయ్యి తగిలి ప్రక్కనే నడిచే ఆంగ్లోఇండియన్ యువతి చంకనున్న రంగుల గొడుగు క్రిందపడిపోవడంగాని, అతని కాలిబూటు కింద ఒక అరవ విద్యార్థిని ఎడమకాలి చిటికెన వ్రేలు పడి నలిగినందువల్ల కుయ్యోమని చేసే ఆక్రందనధ్వని గాని, ఎత్తుమడమల ఫాన్సీషూ తొడుక్కొని, వల్లెవాటుగా పైటవేసుకొని, వయ్యారంగా నడిచే ఒకానొక తెలుగు సినీమానటి పైట చివరినూలు జాలరులో అతనికోటు డిన్నర్ బటన్ తగుల్కొని అతని నడకవిసురులో ఆమె చీరకొంగు పర్రున చిరగడంగాని, అతగాడు గమనించే స్థితిలో లేక ముందుకు సాగిపోవడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకొని వెళ్ళిపోతున్నాడు.

ఆ జనసమ్మర్దంలో అతడా ప్రకారం ఎంత దూరం వెళ్ళాడో—ఒక అయిదు, పది నిముషాలలో ప్లాటుఫారం ఆ చివరినుండి ఇద్దరు మనుషులు మోసే ఒక స్ట్రెచ్చరూ, స్ట్రెచ్చరుమీద గుడ్డకప్పిన ఒక పేషెంటూ ఆ వెనక ఇద్దరు పోలీసుల నడుమ ఆ యువకుడూ—జనంలో త్రోవ చేసుకొంటూ వెనక్కి తిరిగివస్తున్నారు. అంగలు వేసుకుంటూ నిమిషాలమీద స్ట్రెచ్చరుమాత్రం జనరల్ ఆస్పత్రిలోకి వెళ్ళిపోయింది.

పోలీసుల నడుమనున్న ఆ యువకుడిచుట్టూ జనంపోగయి అతనిని తొందరగా సాగిపోనివ్వడం లేదు. గొడుగుపోగొట్టుకొన్న ఆంగ్లోఇండియన్ యువతీ, కాలివేలు నలిగిన అరవవిద్యార్థినీ, చీర చిరిగిన సినీమానటీ, అసుంపు చించుకుని పళ్ళు పటపట కొరుకుతూ అతని ముఖంలోకి చూచి చక్కాపోతున్నారు. జనాన్ని పక్కలకు నెట్టుతూ, పోలీసులతన్ని బయటికి తీసుకొని పోయి ప్రక్కనే ఆఫీసులో ఉన్న పోలీసు అసిస్టెంటు కమీషనరు యెదుట హాజరు పెట్టారు. జరిగిన విషయాలంతా పోలీసులు అసిస్టెంటు కమీషనరుతో మనవి చేశారు. అతడువిని,

"ఆడవాళ్ళంటే నీకింత ఆగ్రహం ఎందుకయ్యా?" అని ఆ యువకుణ్ని అడిగాడు.

అతగాడు పలకలేదు. ఒక్క నిట్టూర్పుమాత్రం విడిచాడు.

"నీ పేరు—" అని అడిగాడు కమీషనరు.

"రాజగోపాల్"

"నీ దేవూరు—"

"బందరు"—

"అక్కడేమి చేస్తున్నావు?"

"ప్రస్తుతం ఏమీ లేదు..."

"ఈ ఊరు ఏపనిమీద వచ్చావు?"

"'బుక్ మిలన్' కంపెనీలో పనిఉండి వచ్చాను."

"అయితే ఆడవాళ్ళంటే నీకు గిట్టదా?"

రాజగోపాల్ బదులు చెప్పలేదు.

"వాళ్లమీద నీకేమైనా ప్రత్యేకమైన ఏవగింపు ఉన్నదా?"

ఆడవాళ్ళంటే నాకేవిధమైన ఏవగింపూ లేదు, కిట్టకపోవడమూ లేదు. అంతేకాదు, వాళ్ళంటే నాకు ప్రత్యేకమైన అభిమానమూ, ఆదరణాకూడా ఉన్నవి."

"అట్లాగా?"

"పురుషులతో బాటు స్త్రీలకు అన్నివిషయాలలోను, సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండాలని ఘట్టిగా వాదించేవాళ్ళలో నేనొకణ్ణి."

"ఊ......"

"వొట్టి శుష్కవాదాలే గాక, స్త్రీల పురోభివృద్ధికి కార్యరూపంగా కృషిచేసి కొంతత్యాగంకూడా చేసిన పురుషులలో నేనొకణ్ణి."

"........."

"స్త్రీలు పునర్వివాహాలకు ముందంజ వేస్తున్నారంటేవాళ్లకంటె నేనే వేయిరెట్లు ఉప్పొంగిపోయాను శారదాబిల్లు శిలాశాసనమైనందుకు నాకు కలిగిన ఆనందం వర్ణనాతీతం. హిందూసంఘంలో పురుషులతో బాటు స్త్రీలకు ఆస్తివిషయంలో సమానమైనహక్కులు సంక్రమింపబోతున్నాయని విని నావలే సంతోషించినవాడు ఆంధ్రదేశంలో మరొకడు ఉండడు."

"ఊఁ......"

"అవకాశమిచ్చినట్లయితే ఏ విషయంలోనూ స్త్రీలు పురుషులకెంతమాత్రం తీసిపోరని నా విశ్వాసం."

"మంచిది—"

"స్త్రీలను అబలలని పిలవడం వారి గౌరవానికే గాక, పురుషుల గౌరవానికికూడా భంగకరమని నేను వాదించేవాణ్ణి."

"బాగుంది—"

"స్త్రీల పురోభివృద్ధికి పాటలు కట్టాను, పదాలు పాడాను, ఉద్బోధలు చేశాను."

"........"

"పురుషులతో సమానంగా స్త్రీలు సైకిళ్లు తొక్కుతున్నారంటే, సంతోషించాను; మోటార్లు నడుపుతున్నారంటే మురిసిపోయాను; గుర్రాలెక్కుతున్నారంటే విర్రవీగిపోయాను; తుదకు కత్తిగట్టి రణరంగంలోకి స్త్రీలు దూకుతున్నారంటే — విజయ భేరి మోగించాను."

"సంతోషం—"

"కాని, కాని—ప్రభూ—"

"ఏమి?—"

"ఒకానొక అనుభవంలో, ఒకానొక సంఘటనలో, ఈ జీవితానికి కొత్తభావాలు పొడకట్టినవి."

"........."

"పురుషులతోబాటు సమానత్వమే గాదు, పురుషులకంటె స్త్రీలు పైకి పెరిగిపోతున్నట్లు నా అనుభవం ప్రత్యక్షంగా నాకు ఋజువు చేసినట్లనిపించింది."

"........."

"స్త్రీలలో ఇటువంటి మార్పు కలుగుతుందని నేనెన్నడూ అనుకోలేదు."

"........."

"నేను వారివల్ల ప్రత్యుపకారం, పారితోషికం, తృణంకూడా ఆశించలేదు—"

"........."

"వాండ్ల పురోభివృద్ధికై ఇంకా సేవచేయడానికి సిద్ధపడి వున్నాను కాని..."

"..............."

"కాని, నేను కోరినది ఆడజాతి సానుభూతి ఒక్కటే—"

"సానుభూతా?—"

"అది లోపించినట్లు నాకు గోచరించినపుడే నాకు తెలియకుండానే నాలో మార్పు వచ్చిందని ఇప్పుడు గ్రహించుకొంటున్నాను—"

"దాని ఫలితమేనా—ఈ నీప్రవర్తన?—"

"క్షమించాలి..."

"నీవేమి చదువుకొన్నావు?"

"బి. ఎ. బందరులో పాసయి, బి. ఎల్. మద్రాసులో నే పూర్తిచేసి ఏడేళ్ళయిందండి.?

"..............."

"బి. ఎల్. పూర్తిచేసి బందరులో బోర్డుకట్టి రెండేళ్ళు గడచినా, తరచు నేను స్త్రీ సంఘోద్ధరణ

వ్యాపకంలోపడి ఉండడంచేత నాకు సంపాదన లేకుండా పోయింది."

"నీకేకాదు—ఈ కాలంలో చాలామంది అడ్వకేట్లకు ఆవిధంగానే ఉన్నది సంపాదన."

"మనవి చేస్తున్నా:—ఈ వృత్తిలో ఆర్జన శూన్యమైనందున కట్టినబోర్డు విప్పి, గవర్నమెంటు సర్వీసు బి. ఎల్., పాసయినవాళ్లకు లాభదాయకంగా ఉన్నదని తెలిసి, ఆ సంబంధమైన పరీక్షలు కూడా ఇచ్చి తాలూకా కచ్చేరిలో గుమాస్తాగా చేరాను."

"మంచిది—"

"కాని, ఒక హరిజన స్త్రీ కుటుంబానికి సర్కారు బంజరు భూమి దరఖాస్తు మీద మంజూరు చేసే విషయములో నాకూ, తహశీల్ దారుకూ అభిప్రాయ భేదాలు కలిగి తగవులుగా పరిణమించినందువల్ల నౌకరీలో చేరిన ఏడెనిమిది నెలలకు నేనా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి బయటికి వచ్చేశాను—"

"తర్వాత—"

"తర్వాతనే జీవితం కొంత దుఃఖ భాజనమైపోయింది. పత్రికలకు కథలూ, పద్యాలూ వ్రాసి పంపితే వాళ్ళు వేసుకోలేదు సరికదా, నా కాగితాలు నాకు వాపసు అయినా పంపేవారు కాదు—"

"పాపం."

"జీవనాధారానికి స్త్రీలపై ఆధారపడడం—నా కిష్టం లేకపోయినప్పటికీ, స్త్రీ సంఘం తరఫున వెలువడే పత్రిక నాచేతిమీదుగా నడుపుతాను—పర్మిషన్ ఇస్తారా, అని వెళ్ళివాళ్ళని అడిగాను—"

"..............."

"వాళ్ళు అంగీకరించలేదు."

"..............."

"నేను వ్రాసిన కథలూ, పద్యాలూ, నాభార్య పేరుతో మీ పత్రికకు పంపుతాను—ప్రకటించి తృణమో పణమో దయచేస్తారా అని నేను స్త్రీసంఘాధ్యక్షురాలిని కోరినమీదట, ఆమె అంగీకరించిందిగాని కొంతకాలం జరిగినపిదప, అటువంటి వృత్తిలో ద్రవ్యార్జనచేయడం నాకే చిన్నతనం అనిపించి నేనా పని విరమించుకొన్నాను."

"బాగుంది—"

"స్త్రీలంటే అప్పటికీ నాహృదయంలో ప్రేమే కాని అనాదరణ మందుకైనా లేదంటే నమ్మండి."

"మంచిది—"

"ఇటీవల 'బుక్ మిలన్' కంపెనీకి ఏజెంట్లు కావాలని పత్రికల్లో ప్రకటనపడితే—ఇంటివద్ద జరిగే విధం కనిపించక— నేను దరఖాస్తు పంపుకొన్నాను."

"..............."

"నెలకు నూరు రూపాయల ఉద్యోగమిది—"

"మంచిది—"

"ఈసాయంత్రం 3 గంటలకు నన్ను ఇంటర్వ్యూకు రమ్మని కంపెనీనుండి ఆహ్వానంవస్తే యీ ఉదయం మెయిలులో నేనిక్కడకు వచ్చాను."

"వచ్చిన పని అయిందా?"

"మనవిచేస్తున్నా — మైలాపూర్ లో నా స్నేహితుని ఇంట్లో బసచేశాను. నేను వెళ్లవలసిన కంపెనీ టౌన్‌లో ఉన్నది. దూరప్రయాణం—సరిగా వేళకందుకోవలసి యున్నందున, మధ్యాహ్నం 2 గంటలు కాకుండానే సూటు వేసుకొని, బూటు తొడుక్కొని, కాలర్, టై వగైరాలు వేసుకొని, కంపెనీకి బయల్దేరాను. బస్సుస్టాండుకు వచ్చాను."

"..............."

"నేను స్టాండుదగ్గరకువచ్చి రిస్టువాచీ చూచుకొనేసరికి సరిగా 2 గంటలయింది. స్టాండుదగ్గర రెండుబస్సులకు సరిపడా జనం ఆడా, మొగా, నిలబడి ఉన్నారు. అంత జనసమ్మర్దం ఉండడానికి కారణమేమని విచారించగా మాటినీ సినీమాకు వేళ అయిందని తెలిసింది. ఆ జనాన్ని తోసుకొని బస్సులో పడడమెట్లా అని నాకు భయమంకురించింది. మొహమంతా కళ్లుచేసుకొని బస్సుకొరకు ఎగురు తెన్నులు చూస్తూ జనం తోసుకుంటున్నారు. ఇంతలో బర్రుమంటూ బస్సొకటి వచ్చి స్టాండుమీద నిలిచింది. బస్సు ఇంకా పూర్తిగా నిలబడకుండానే సమీపించే బస్సుకి ఎదురుగాపోయి కమ్మీలు పట్టుకొని చిన్నపిల్లలు వెంబడించినట్లు కూడా పరుగులు తీస్తున్నారు కొందరు పెద్దమనుష్యులు. దిగవలసిన జనాన్ని దిగనీయకుండా ఎక్కవలసిన జనం తోసుకుంటూ జంట

జంటలుగా లోపలకు దూరి కూర్చుంటున్నారు. నేను ఆలస్యంగా వెళ్ళినందువల్ల గుంపు చివరపడిపోయి ఎడంగా నిలబడి ఉన్నాను. ఆ త్రొక్కిడిలో లోపలకు పోలేని ఆడవాళ్ళు ముందుకువచ్చి కూడా, ఆతురపడే మొగవాళ్ళకు ఎడమిచ్చి పైదొలగి ఊరుకున్నారు. ఇక ఆ బస్సులో కాలిడగల ప్రాప్తం నాకులేదని నిరాశ చేసుకొని రిస్టువాచీ చూచుకొనేసరికి రెండుగంటల మీద అయిదు నిమిషాలయింది."

"........................"

"ఈ బస్సుకదిలి జనసమ్మర్దం తగ్గితే రెండో బస్సులో పోదామనుకొని నేను ఎడంగా నిలబడి, చిటచిటలాడే ఎండ వేడిమికి ముఖాన్న లేచిన ఘర్మ బిందువుల్ని చేతిరుమాలుతో అద్దుకొనే ఆడగుంపును జాలిగా చూస్తూ ఊరుకున్నాను—"

"కాని ఎంతసేపు ఆవిధంగా నిలబడడం 3 గంటలకల్లా కంపెనీదొర సముఖంలో నేనుండాలిగదా! ఇంకా రమారమి ఒక గంట వ్యవధే ఉన్నది. బస్సు అంటూవచ్చి, దానిలో పడితే ఎంతసేపు ప్రయాణం! రెండో బస్సుకోసరం ఎదురుచూస్తూ నిలబడిఉన్నాను. ఇంకో పదినిమిషాలకు రెండోబస్సు వస్తుందని చెప్పుకుంటున్నారు, అక్కడ నిలబడ్డ ఆడంగులు. రిస్టువాచీలో నిమిషాలూ, సెకండూ లెఖ్ఖపెట్టుకొంటూ నేనూ ఆ ఎండలో అట్లానే నిలబడిపోయాను.

ఒక పావుగంటకు రెండోబస్సు వచ్చి స్టాండు మీద నిలిచింది. మొదటిబస్సు కున్నంత తొక్కిడి రెండోబస్సుకు లేకపోయినా, ఈసారికూడా ఒక బస్సుకుమించిన జనమే పోగయ్యారు ఆసమయానికి. మొదటి బస్సులో అందరూ మొగవాళ్ళే ఎక్కిపోయినందున రెండోబస్సుకి మిగిలిపోయిన వాళ్ళలో చాలామంది ఆడవాళ్ళే నిలబడిపోయారు. అందువల రెండో బస్సు వచ్చి రావడంతోటే ముందు ఎక్కువగా ఎక్కగలిగిన వాళ్లందరూ ఆడవాళ్ళే. ఈబస్సు దాటిపోకుండాలోపల దూరడానికి ప్రయత్నం చేద్దామని నేను దగ్గరకుపోయి బస్సు కమ్మీ పట్టుకున్నాను. కాని అప్పటికే బస్సు నిండిపోయినందున కండక్టరు లోపలకువల్లి లెక్కచూచుకుని ఇక ఖాళీలేదని అంటూ బస్సు డ్రయివరుకు బిగులు ఊదాడు."

"..........................."

ఇంతలో ఒక తెలుగు వితంతువు వచ్చి జనరల్ ఆస్పత్రిలో రోగిగా పడిఉన్న తన కొడుకు దగ్గరకు అర్జంటుగా పోవలసి వున్నదనీ, బస్సులో ఎక్కిన వారిలో ఎవరయినా ఒకరు దిగితనకు ఖాళీచేయవలసినదని బహుదీనంగా ప్రార్థించేసరికి బస్సులో కూర్చున్న ఒక లేడీ కనికరించి ఆవితంతువు నెక్కించింది.—

ఇక నేను ఎక్కడం ఎట్లా? నావిషయంలో కూడా ఏస్త్రీ అయినా కరుణించి ఖాళీ చేయవలసినదని ప్రార్థిద్దామని నోటి చివరిదాకా వచ్చింది, కాని ఇంతలో డ్రయివరు బ్రరున గేరుమార్చి, బంయి, బంయి మని హారన్ ఊదుకొంటూ బస్సు పోనిచ్చాడు.

నా చేతిలోని బస్సుకమ్మీ పట్టుజారి, నేను ఎడమైపోయాను.

రిస్టువాచీలో రెండున్నరగంటలకి ఇంకో అయిదు నిమిషాలు కొంబోలు, కొరత ఉన్నది.

కాలయాపన అయిపోతున్నందుకు నాగుండె కూడా పట్టు జారిపోవడం ఆరంభించింది.

భోజనం అయిన వెంటనే 12 గంటలకల్లా కంపెనీకివెళ్ళి కనిపెట్టుకొని ఉండకపోయినందుకు— అన్నా అని నాలుక కరచుకొన్నాను. టౌనుకి వెళ్లడం ఎట్లాగో తోచలేదు. ఆ పేటకి ట్రాంబండి కనెక్షన్ లేదు. సైకిలొకటి దొరికితే ఎట్లాగో తొక్కుకొని పోవచ్చుగాని, నాకప్పుడు సైకిలెవరిస్తారు? ఎంతసేపు చూచినా అతట్టు నాకు జట్కా అయినా కనిపించలేదు. రిక్షావాడికో ముప్పావులా పారేస్తే లాక్కొనిపోతాడు గాని, ఇంతదూరం నడచి పోయేవరకు వేళ మించి పోదూ?

"................"

"నాకాందోళన ఎక్కువైంది. పక్కకి తిరిగి చూచుకుంటే మళ్ళా ఒక బస్సుకు సరిపోయే జనం తయారయి పోతున్నారు. ఇందాక రెండో బస్సులో వితంతువుకి ఖాళీచేసి దిగిన లేడీ, ఎప్పుడెక్కుదామా బస్సు అని ఆతురపడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ సారి ఆమె కంటె కూడా ముందెక్కి కూర్చోవాలని నాకూ జాస్తి అయింది ఆతురత. మూడోబస్సు వచ్చి రావడంతోనే కమ్మీపట్టుకొని లోపలకు దూరి కూర్చోవాలని నేను నిశ్చయించుకున్నాను.

రిస్టువాచీ చూచుకుంటే రెండుగంటల మీద నలభై నిముషాలయి పోయింది. ఇంక ఆలస్యం ఎంత మాత్రమూ జరగడానికి వీల్లేదని నేను నిశ్చయ పరచు

కొంటూ ఉండగానే, బర్రుమంటూ మూడో బస్సు వచ్చి స్టాండుమీద నిలబడింది. అది ఇంకా పూర్తిగా నిలబడకుండానే నేను ఫుట్‌బోర్డుమీద కాలుపెట్టి, కమ్మీపట్టుకొని, గభాలున లోపలకు దూరి ఖాళీ అయిన ఒక సీటులో స్థిరంగా కూర్చున్నాను. గుండెలో ఆందోళన కొంత తగింది. బస్సు బయల్దేరితే ఇంకో పావుగంటలో టౌన్‌కి వెళ్ళిపోవచ్చు. మనస్సు కుదుటపడింది—ఏదో పుస్తకంలో సంతకం పెట్టి రావడానికి గాబోలు కండక్టరు బస్సుదిగి వెళ్ళిపోయాడు. డ్రయివరు కూడా దిగి ఇంజన్ పక్క నిలబడి బీడీ కాల్చుకుంటున్నాడు. ఎక్కడనుండి ఎప్పుడు వచ్చారో పాసెంజర్లు ఇంకా ఎక్కుతూనే ఉన్నారు. సీట్లన్నీ భర్తీఅయిపోయి ఒకరిద్దరు పెద్ద మనుష్యులు టాపుకి తగిలించిన కమ్మీ పట్టుకొని నిల బడ్డారు.

ఎంత త్యాగమూర్తో, రెండో బస్సు నుండి దిగిన ఆ స్త్రీ ఆ తొక్కిడిలో ఎక్కకుండా మొగ వాళ్ళందరూ ఎక్కే వరకూ అటనే నిలబడి, అందరూ ఎక్కిన తర్వాత ఎక్కి, లోపల సీట్లన్నీ భర్తీ అయి పోయినందు వల్ల నా ఎదురుగ్గానే టాపు కమ్మీపట్టు కొని నిలబడింది.

డ్రయివరింకా బీడీ కాలుస్తూనే ఉన్నాడు.
కండక్టరింకా రాలేదు.

నా వాచీలో 3 గంటలకు ఇంకో పదినిమిషాలు మాత్రమే కొరవ ఉన్నది. బస్సు తొందరగా బయ ల్దేరితే బాగుండునని నాకు తొందరెక్కువైంది.

కాని—ఈ స్త్రీ—నా ఎదుట నిలబడే ఉన్నది. బస్సునిండా మొగవాళ్లు, తింగురంగా అని సీట్లు భర్తీ చేసుకొని కూర్చున్నవాళ్ళేగాని, ఒక్కడూ లేచినిలబడి ఆమె కూర్చోవడానికి కాస్త ఖాళీ చేసినవాడు కనిపించడు. రెండోబస్సులో ఎక్కి కూర్చున్న మనిషి ఆమె. దిగి మరొక స్త్రీకి స్థలమిచ్చిన త్యాగమూర్తిఆమె. మూడోబస్సులోకూడా తొందరపడి మొగవాళ్ళ సందున నలిగి ఎక్కడాని కిష్టంలేక అందరూ లోపలకి వెళ్లేవరకూ తాను ఎడంగా నిలబడి ఆఖరున ఎక్కి, అంతమందిలోనూ నిలబడి ప్రయాణం చేయడానికి నిశ్చయించుకొన్న శీలవతి ఆ ఇల్లాలు! ఆ బస్సులో ఆమెతప్ప మరో స్త్రీ ఎవ్వరూ లేరు.

ఒక్క మొగపురుగయినా లేచి నిలబడి ఆమెను కూర్చోబెట్ట డెందువల్ల?

ఆమెను చూచి నాకు జాలివేసింది. గుండె కరిగింది. అమెను కూర్చోబెట్టి, మనమే నిలబడి ప్రయాణం చేద్దామని అనుకొని, వెంటనే నేను లేచి,

"మీరిట్లా కూర్చోండి" అని నాసీటు ఆమెకు చూపించాను.

"ఆమె నాసీటులో కూర్చుని, "థాంక్సు" అని చెప్పినట్టే, నా మనస్సుకు తట్టి, నేనూ తృప్తిపడి చిరునవ్వు నవ్వుతుండగనే,

"టిక్కెట్టు" అంటూ కండక్టరు లోపలకువచ్చి "స్టాండింగు కడియాదు, ఎల్లా రెరంగో" అని కేక వెట్టాడు.

"ఎవరినీ కండక్టరు దిగమంటున్నాడు?" అని నేను తర్కించుకొనేలోపలనే, నాతో బాటు టాపు పట్టుకుని నిలబడ్డ ఇద్దరు పెద్దమనుష్యులూ దిగి చక్కా బోయారు—నేనొక్కణ్ణే టాపు పట్టుకొని అట్లానే నిలబడ్డాను."

"స్టాండింగు కడియాదు. ఎరంగో సామీ" అని, నాతో ఘటిగా చెప్పాడు కండక్టరు.

"అర్జంటు పనిమీద నేను టౌన్‌కి వెళ్లాలి గంట నుంచి కాచుకొని ఉన్నాను—మిస్టర్ కండక్టర్" అన్నాను నేను.

"అదెల్లా ముడియాదు. ఎరంగో సామీ" అన్నాడు కండక్టరు.

"అందరికంటె ముందెక్కానయ్యా నేను బస్సు. ఎలాగయ్యా దిగేది?" అన్నాను నేను.

"ముందెక్కితే సీటులో కూర్చోవాలిగాని, నిల బడ కూడ"దన్నాడు కండక్టరు.

"మరి ఇందాక రెండు బస్సుల్లోనూ జనం ఎక్కి నిలబడ్డారే" అన్నాను నేను.

" ఆ బస్సులో ముగ్గురు స్టాండింగు పాసెంజర్లకు లైసెన్సు ఉన్నది. ఈ బస్సుకు అటువంటి లైసెన్సు లేదన్నాడు"—కండక్టరు.

"ఎన్నా అయ్యా! శీఘ్రం ఎరంగయ్యా! రొంబ నేరం అయిపోచ్చి" అని కేక పెట్టాడు—ముందునుండి డ్రయివరు.

"నా సీటులో కూర్చున్న ఆమె ముఖంలోకి జాలిగా చూశాను నేను."

శిల్పంకొటిన రాయిలా ఆమె అట్లనే కూర్చున్నది. అంతమంది మొగవాళ్ళలోనూ ఆమె ఒక్కతే ఆడమనిషి! ముందెక్కి కూర్చున్న నేను దిగవలసి, చివరఎక్కిన ఆ ఆడమనిషి కూర్చోవలసి వచ్చినప్పుడు ఒక్క మొగవాడుకూడా నా పక్షం న్యాయం చెప్పడానికి నోరు మెదపడే. ఆ ఆడమనిషికన్నా చేతిరుమాలు నోటికడ్డం పెట్టుకొని, నా కడుపు దహించేలా చిరునవ్వు నవ్వుతుందిగాని, పలకదే! రెండోబస్సులో మరొక స్త్రీ విషయమై తాను చూపించిన త్యాగం ఇప్పుడు పురుషుడనైన నాయెడల ఆమె ఎందుకు చూపించగూడదు? నా విషయంలో ఆమె చేసేది త్యాగం కానేకాదు. అసలు ఆమె కూర్చున్న సీటు నాదే!

నాకు రోషంవచ్చింది. దుఃఖం వచ్చింది— నిట్టూర్పువిడిచి బస్సు దిగాను.

పొగలువిడుస్తూ బస్సు కదిలింది.

"............................."

"ఇంటిదగ్గర బయల్దేరిన వేళావిశేషం. ఒక మైలు నడచివెళ్ళితే ట్రాంఅయినా చిక్కి ఈపాటికి కంపెనీ చేరుకు నేవాణ్ణి. ట్రాంలో వెళ్ళితే ఆలస్యం అవుతుంది. బస్సులో వెళ్ళమన్నాడు నా స్నేహితుడు—"

ఈ బస్సుని నమ్ముకొని బయల్దేరాను.

మూడుగంటలు కావస్తోంది. వేళమించి నేను వెళ్ళితే దొర నన్ను లోపలకు రానిస్తాడా?

దిక్కుతోచలేదు. ఇంత దూరదేశం వ్యయప్రయాసలకోర్చి వచ్చిన పనిఅంతా భగ్నంపాడయి పోయేటట్లు వున్నదే! మూడుగంటలకు ఇక పదినిముషాలే ఉన్నది!

ఏమిగతి భగవంతుడా!

అని నేనాందోళన పడుతుండగనే స్టాండుదగ్గర మాళ్ళా జనం కిటకిటలాడిపోతున్నారు.

3-15 గంటలకు మాటినీ సినీమా వేళ కాబోలు! స్కోల్జర్లు, ఆంగ్లోఇండియన్ యువతులు, స్టూడెంట్లు—సింగారించుకుని, హేరాయిలూ, సెంట్లూ రాచుకుని ఘుమఘుములాడుతూ, సిగరెట్లు పీలుస్తూ తండాలు తండాలుగావచ్చి పోగయారు.

ఇక రాబోయేది నాలుగోబస్సు. ఈ బస్సు అయినా చిక్కితే ఇంటర్వ్యూవేళకి ఓఅయిదూ పది నిమిషాలు ఆలస్యంగా అందుకొని, ఆలస్యానికి క్షమాపణ చెప్పుకోవచ్చు. కాని ఈసారిమాత్రం బస్సెక్కడానికి నాకు వీలు చిక్కుతుందని ఏమి నమ్మకం! వీలు చిక్కకపోతే ఎట్లా?

నాకు ఖంగా రెక్కువైంది. తల దిమ్మెక్కింది. దాహం నోరెండిపోతోంది. దగ్గరలో సోడా కొట్టుకయినా వెళ్ళి రావడానికి, బస్సు వచ్చి వెళ్ళిపోతుందేమోనని మనస్సుకు స్తిమితం చిక్కడంలేదు. నిలబడి వుండడానికి కాళ్ళాడడంలేదు.

ఈజనం ఇంతమంది ఇప్పుడు సినీమాలకు పోకపోతేనేం? యుద్ధపురోజుల్లో బియ్యమూ, పెట్రోలు, కిరసనాయిలూ సర్కారువారు రేషను పెట్టి పంచినట్లు బస్సుల్లోను, రైళ్లలోనూ స్థలంకూడా ప్రయాణీకుల అవసరంకొద్దీ రేషనింగు పెట్టి పంచితే ఎంతబాగుండేదో. సినీమాలకు పోయేవాళ్ళు ఏ రిక్షాలోనయినా పోగూడదూ—"

"ఇట్లా నేననుకొంటూ ఉండగా నాలుగో బస్సుకూడా వచ్చి స్టాండుమీద ఆగింది. నాకు వొళ్లు తెలియలేదు. బస్సులోనుండి దిగేవాళ్లెవరో ఎక్కేవారెవరో నాకు తెలియడంలేను. బస్సుగేటుదగ్గర జనం మూగి మోచేతులతో పొడుచుకుంటున్నారు. శివమెత్తినట్టయి నేనాగుంపులో జొరబడ్డాను. బస్సు కమ్మీ పట్టుకొన్న ఒక చేతిక్రింద నుండి దూరి ఫుట్ బోర్డుమీద కాలు పెట్టబోతున్నాను. కమ్మీపట్టుకొన్న చెయ్యి ఒక ఆంగ్లోఇండియన్ యువతిది. ఆమె నాకంటెముందు బస్సులో కాలు పెట్టి తన ఎడంచేతిలోని తోలుసంచీ నా సందున, నా ప్రక్కనే త్రోసుకొనిఎక్కే మరొకప్యాసెంజరు సందునాపడి ఊడిరావందున ఆమె వెనక్కితిరిగి నా వైపుచూచింది. నేను లోపలకిపోయే ప్రయత్నంలోనే ఉన్నాను కాని, ఆమె తోలుసంచీ విడిపించాలని నాకాలోచన తోచలేదు. ఆమెకు కోపం ఎక్కువైంది.

పైన నిలబడిన ఆమె తన కుడిచేత్తో నా గుండెలమీద ఘట్టిగా అదిమి వెనక్కినెట్టింది. నేను కమ్మీ పట్టుకొని కదలలేదు.

ఆమె తన బలంకొద్దీ నన్ను నెట్టుతోంది. నేను ముందుకు సాగుతున్నాను.

ఆమెచెయ్యి నా చొక్కాకు తగిలించిన క్రిమెంట్సు గుండీమీదపడి, నెట్టడంలో నా రొమ్ముకి గుండీ గుచ్చుకొని నాకు బాధకలిగింది. ఆమె ఇంగ్లీషులో ఏదో గొణుగుకొంటూ, పళ్ళు పటపట కొరికి నన్ను ఒక్కసారి వెనక్కి నెట్టింది.

నా వెనుక జనాన్ని చిందుకొంటూ నేను వెనక్కి వెల్లకిలాపడ్డాను. నడుము ఖరేలుమన్నది. తల పగిలిందనుకొన్నానుగాని, ఒక లేడీ కాళ్లకు తగిలించిన ఎత్తు మడిమలబూటు నా తల క్రిందపడి కొంత రక్షించింది.

ఆ స్థితిలోపడ్డ నేను ఎప్పుడు లేచానో, మిగిలి ఉన్న జనం ఎప్పుడు బస్సులోకి ఎక్కారో నాకు తెలియదు గాని నన్నక్కడ విడిచి బస్సు సాగిపోయింది."

"వెరీ సారీ" అన్నాడు కమీషనరు.

"నేను వేసుకొన్న సూటు పాడయిపోయింది. నా జుట్టు చెరిగిపోయింది. నా గుండె చెదరిపోయింది.

రిస్టువాచీలో 3-10 నిముషాలయింది.

ఇంకెక్కడి కంపెనీ, ఇంకెక్కడి ఉద్యోగం! ఇంతదూరం వచ్చి దొరని చూడకుండా వెళ్ళడం ఎట్లా?

నా మనస్సులో ఆలోచన ఏమీ తట్టలేదు. పిచ్చెత్తిన వాడిలా ఆ రోడ్డున ఒక అరమైలు పరుగు పెట్టాను. జట్కా ఒకటి కనిపించింది—ఒకరూపాయి ఇస్తానన్నాను. నన్ను టౌన్‌కి తీసుకొని వెళ్ళాడు.

"నా రిసువాచీలో నాలుగుగంటలు కావస్తోంది. కంపెనీకి వెళ్ళి జవానుచేత దొరకి చీటీ పంపించాను. అయిదు నిముషాలకు నాకు లోపలకు రమ్మని పర్మిషన్ వచ్చింది—

గుడ్డలు సవరించుకుంటూ లోపలకు వెళ్లాను. దొరగారి గదికి తగిలించిన వికెట్ గేటు తెరచుకొని నాకెదురుగా వస్తోంది. ఇందాక మూడో బస్సులో నేను చోటిచ్చిన స్త్రీ.

నేను తెల్లబోయి చూస్తుండగా ఆమె నా వైపు వికటంగా చూచి నవ్వుతూ నన్ను రాచుకొంటూనే చక్కాపోయింది.

అడుగులు కొలుచుకుంటూ నేను దొరగారి గదిలోకి పోయి, "ఆలస్యానికి క్షమించండి" అన్నాను.

"నీవు పదినిముషాలు ముందు వచ్చి ఉంటే నీకే ఇచ్చేవాణ్ణి. నీ దరఖాస్తు పంపుకొన్న స్థానానికి ఇప్పుడే ఆ లేడీ గ్రాడ్యుయేటును వేశాను—ఇక ఇప్పుడు ఖాళీలులే"వన్నాడు దొర.

"నీవిక వెళ్ళవచ్చును." అని దొర అనేవరకు అతనివద్ద శలవు పుచ్చుకుని నేను బయటకు రావాలన్న సంగతి నాకు స్ఫురించలేదు.

ఎట్లా వెళ్లానో ఒకగంటలో నేను బసకు చేరుకున్నాను. నా పెట్టె సర్దుకున్నాను.

మద్రాసు నాపాలిట నిప్పుల గుండంలా కనిపించింది. నాఉద్యోగానికి అడ్డంతగిలిన ఆ స్త్రీ నా కళ్ళకు పెనుభూతంలా కనిపించింది. కనిపించితే ఆమెను నమిలి మింగివేయాలన్నంత ఆగ్రహం కలిగింది.

నా కళ్లకి స్త్రీ కనిపించినపుడల్లా కళ్లు మూసుకొన్నాను. నాలో ఏదో భరింపరాని బాధకలిగి ఏడ్చాను.

మెయిల్లో బందరు వెళ్లిపోవాలని, రిక్షా కట్టించుకొని సెంట్రల్‌కి వచ్చాను.

అక్కడి జనసమ్మర్దం నన్ను మరింత భయపెట్టింది. నా బస్సు ప్రయాణం అనుభవం తలలో మండిపోతోంది, టిక్కట్టుకొనుక్కొని ప్లాటుఫారం మీదకి పోయాను. కాని, ఈరోజు రైలుకూడా ఎక్కలేనేమోనని భయం వేసింది. ఒక కారేజిదగ్గరకు వెళ్ళి తలుపు నెట్టాను—

"ఇది మిలిటరీకి రిజర్వుడు, పో" అని లోపల నుండి నన్నెవరో నెటినట్టయింది. పరుగుమీద మరో పెట్టెదగ్గరకు వెళ్లాను. లోపలకు వెళ్లడానికి గేటుకమ్మీ పట్టుకొన్నాను. ఇంతలో ఒక స్త్రీ నాకడ్డం వచ్చి తన చేతిలోని పండ్లబుట్ట గేటు కడ్డంగా పెటి ప్లాటుఫారంమీదనున్న తన ఇతరసామాను లోపల పెట్టబోతోంది. ఆమె ముఖంలోకి తేరిపార చూశాను.

ఇందాక నేను బస్సులో ఖాళీచేసి సీటు ఇచ్చినటువంటీ, దొరదగ్గర నా ఉద్యోగానికి అడ్డం వచ్చినటువంటీ స్త్రీ-ఆమే!

ఆ అడ్డాలు చాలక, ఇప్పుడు తిరిగి రైలుదగ్గర కూడా నా కడ్డం వచ్చిందీమె! అని నాకు వొళ్లు భగ్గున మండిపోయింది.—

నా కుడిచేత్తో ఆమెను ఒక్క నెట్టు నెట్టాను. నేను లోపలకెక్కి కూర్చున్నాను.

ఆమె తుళ్ళి వెనక ప్లాటుఫారముమీద కూలీలు లాగే ట్రాలీ చక్రంమీద పడి ఆమె తల భళ్ళున పగిలి నెత్తురు వరదలైంది.

ఇంతలో స్ట్రెచ్చరు వచ్చి ఆమెనాసుపత్రికి తీసుకొనిపోయింది—

పోలీసులు పట్టుకొని నన్ను మీ దగ్గరకు తీసుకొని వచ్చారు."

అని రాజగోపాల్ చెప్పినదంతా విని "ఇతని నీ రాత్రి లాకప్పులో ఉంచండని" అంటూ అసిస్టెంటు కమీషనరు లేచి చక్కాపోయాడు.